

ఉరివేసుకుని టీచర్ మృతి

అనుమానాస్పద స్థితిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తన అపార్ట్‌మెంట్‌లో ఆత్మహత్యకు పాల్పడటం కలకలం సృష్టించింది. 8లో



ఎరువుల వాడకం తగ్గాలి

వరి సాగులో ఎరువుల వాడకం తగ్గించాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ శ్రీనివాస్ సూచించారు. 8లో



టైం టేబుల్‌పై రగడ

సమీకృత ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్న నూజివీడు ట్రిపుల్‌ఐటీలో మెంటార్లకు పీరియడ్ల కేటాయింపు వివాదంగా మారింది. 8లో

న్యూస్‌రీల్

ఉంగుటూరు బస్టాండ్‌లో బస్సుల నిలుపుదల



ఆర్టీసీ బస్సులను నిలుపుదల చేస్తున్న అధికారులు

సాక్షి స్పందన

ఉంగుటూరు: 'బస్టాండు ఇక్కడ–బస్సులు ఆపేది అక్కడ' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురించిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. తణుకు డిపో మేనేజర్, తాడేపల్లిగూడెం డిపో ఇన్‌చార్జి డీఎంగా వ్యవహరిస్తున్న సప్పా గిరిధర్‌కుమార్, తణుకు సీఐ మురళీ, తాడేపల్లిగూడెం సీఐ ఎల్.సుధారాణి ఉంగుటూరు వచ్చారు. బస్టాండ్‌లో నిద్రిస్తున్న బిచ్చగాళ్లను పోలీసుల సాయంతో అక్కడి నుంచి వేరే చోటుకు పంపించారు. బస్టాండ్‌లోనే బస్సులను నిలుపుదల చేయించారు. డీఎం గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ ఇక నుంచి బస్టాండ్ వద్దనే బస్సులు ఆపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారం పాటు కంట్రోలర్లు ఉంగుటూరులోని ఉండి బస్టాండ్ వద్దనే బస్సులు ఆపేలా డ్యూటీలు వేస్తామని చెప్పారు.

ఏడో రోజుకు ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె



నూజివీడులో ఆందోళన చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

నూజివీడు: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నూజివీడు మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఏడో రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో యూనియన్ అధ్యక్షుడు ఎదురేసి అప్పారావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందికి ఏడేళ్లుగా జీతాలు పెంచకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని, కార్మికుల సమస్యలపై ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. కార్మికులకు వేతనాలు పెంచాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సంక్షేమ పథకాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు లటికే రంగారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఈనెల 27 నుంచి నిర్వహించనున్నారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. పరీక్షలను రాష్ట్రంలోని 18 జిల్లాల్లో నిర్వహించనున్నారని, ఆగస్టు 1 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మొత్తం 41,418 మంది ఉద్యోగులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. హాల్‌టికెట్లు ఈనెల 22 నుంచి ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

చెత్తశుద్ధి కరువు



భీమవరం మెంటేవారితోటలో చెత్తతో నిండిన డ్రెయిన్

ఇదేనా స్వచ్ఛాంధ్ర?

- డంపింగ్ యార్డులుగా రోడ్లు, డ్రెయిన్లు
- ఆచరణలో కానరాని స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర
- నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు
- క్షీణించిన పారిశుద్ధ్యంతో సీజనల్ వ్యాధుల భయం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని రోడ్ల మార్జిన్లు చెత్తాచెదారాలతో కంపు కొడుతున్నాయి. డ్రెయిన్లు వ్యర్థాలతో అధ్వానంగా మారాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ఆర్భాటంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ పరిస్థితి ఇది. తణుకులో పర్యటించిన సీఎం చంద్రబాబు 'పారిశుద్ధ్య పనులు చేయకపోతే అధికారులు, ప్రజాప్రతినిధులదే బాధ్యత', 'ఎక్కడా చెత్త కనిపించవద్దు.. ఎప్పుడైనా వచ్చి తనిఖీ చేస్తా' అని హెచ్చరించినా అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. జిల్లాలోని పట్టణాల నుంచి పల్లెల వరకూ రోడ్ల మార్జిన్లు చెత్తాచెదారం, ప్రమాదకర వస్తువులతో డంపింగ్ యార్డులు ఉన్నాయి. అలాగే మురుగు కాలువలు, డ్రెయిన్లు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోయాయి.

20 మండలాలు.. 409 పంచాయతీలు

జిల్లాలో 20 మండలాలు, 6 మున్సిపాలిటీలు, 409 పంచాయతీలు ఉన్నాయి. దాదాపు అన్ని చోట్లా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగానే ఉంది. కొన్నిచోట్ల డ్రెయిన్లలోకి కొందరు టాయిలెట్స్ పైపులను పెట్టడం, డ్రెయిన్లను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టడంతో పూర్తిస్థాయిలో మురుగు పారడం లేదు. దీంతో పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది.

సంపద సృష్టి అంతంతమాత్రమే..

జిల్లాలో దాదాపు అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు ఉన్నాయి. అయితే వీటి నిర్వహణ అధ్వానంగా ఉంది. ఒకటి, రెండు పంచాయతీలు మినహా మిగిలిన కేంద్రాల నిర్వహణను పంచాయతీ అధికారులు గాలికి వదిలివేశారు. దీంతో సంపద సృష్టించే కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించడం లేదు. కొన్నిచోట్ల కేంద్రాల ఆవరణల్లో, మరికొన్ని చోట్ల ఊరి శివార్లలో రోడ్ల వెంబడి డంప్ చేస్తున్నారు.



వీరవాసరం–బ్రాహ్మణచెరువు రోడ్డులో నవుడూరు రోడ్డు వెంబడి చెత్త

సీజనల్ వ్యాధుల వ్యాప్తి

చెత్తను ఎక్కడపడితే అక్కడ డంప్ చేయడంతో సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతోంది. దోమలు విజృంభించి డెంగ్యూ, మలేరియా వ్యాపించే అవకాశం ఉంది. అలాగే పలుచోట్ల జ్వరాలు ప్రబలుతున్నాయి.

దోమలు విజృంభిస్తున్నాయి



భీమవరంలో రోడ్లు, డ్రెయిన్ల వెంబడి చెత్తాచెదారంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. 1,2 వార్డుల మీదుగా ప్రవహించే మిరియమియా కోడు (మురుగు డ్రెయిన్)లో చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో డ్రెయిన్ మరింత దారుణంగా మారి దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు.

– పాలవెల్లి మంగ, 1వ వార్డు, భీమవరం

నిర్వహణ లేక నిరుపయోగం



మా గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. ఈ కేంద్రంలో పొడి, తడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేరు చేసే విభాగాలు ధ్వంసమయ్యాయి. దీంతో చెత్తను కేంద్రం ఆవరణలో డంప్ చేస్తున్నారు. కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి వర్మీకంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలి.

–బి.రాంబాబు కొండేపూడి



కొండేపూడిలో నిరుపయోగంగా మారిన సంపద సృష్టి కేంద్రం

అధికారుల అలసత్వం

జిల్లాలో రోడ్లు, డ్రెయిన్లు, మురుగు కాలువలు చెత్తతో నిండిపోతున్నా కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా పట్టడం లేదు. ఊళ్లన్నీ చెత్తతో నిండిపోతున్నా, చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల నిర్వహణ తీరు సరిగా లేకున్నా కలెక్టర్ పట్టించుకునే పరిస్థితి లేదు. అలాగే జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతిపక్ష పార్టీ నాయకులపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు తప్ప ఆయా నియోజకవర్గాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దళిత వితంతువుపై టీడీపీ నేతల వేధింపులు



కనకాయలంకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పలు పార్టీల నాయకులు

యలమంచిలి: తమ ఇళ్లకు దారి ఇవ్వడం లేదనే అక్కసుతో కనకాయలంక గ్రామంలో తెలుగుదేశం నాయకులు ఓ దళిత వితంతువుపై కక్ష సాధింపులకు పూనుకున్నారు. దీనిని నిరసిస్తూ ఆదివారం మిగిలిన పార్టీల నాయకులు నిరసన తెలిపి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. కనకాయలంకకి చెందిన దళిత వితంతువు డొల్లా విజయలక్ష్మి గ్రామంలో రేకుల షెడ్డు వేసుకుని జీవిస్తోంది. ఆమెకున్న స్థలంలో నుంచి దారి కావాలని చాలాకాలంగా స్థానిక తెలుగుదేశం నాయకులు పట్టుబడుతున్నారు. రెవెన్యూ అధికారులు కూడా స్థలాన్ని పరిశీలించి ఆమె అంగీకరిస్తే రోడ్డు వేసుకోమని చెప్పారు. అయితే ఆ స్థలంలో తాను ఇల్లు కట్టుకుంటానని, అంతవరకూ తిరగడానికి అభ్యంతరం లేదని, కానీ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి స్థలం ఇవ్వనని విజయలక్ష్మి చెప్పింది. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం ఆమె తను రేకుల షెడ్డుకు విద్యుత్ సర్వీసును ఏర్పాటు చేసుకుంది. అయితే తెలుగుదేశం నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఆమె ఇంటి విద్యుత్ మీటర్‌ను తొలగింపజేశారు. దీనిపై గ్రామంలోని మిగిలిన పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న తెలుగుదేశం నాయకుల తీరును నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ, జనసేన నాయకులు పులి వెంకట సుబ్రహ్మణ్యం, వలవల ప్రసాద్, లంక కిషోర్, వలవల శ్రీనివాస్, చింద్రపు గణపతి, నెల్లి ఆనందరావు, యన్నాబత్తుల సుధీర్, వలవల నరసింహమూర్తి, కారుపల్లి శ్రీను, చిల్లే రవి, చిల్లే నాని, యాతం నాగపండు, యాతం సీతారాముడు, యాతం రెడ్డి నాయుడు, యాతం వెంకటేశ్వరరావు (చిన్నబ్బు) తదితరులు పాల్గొన్నారు.

మద్యం పాలసీకి చంద్రబాబే సూత్రధారి

మాజీ మంత్రి కొట్టు సత్యనారయణ



పెంటపాడులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: రాష్ట్రంలో మద్యం పాలసీకి సూత్రధారి సీఎం చంద్రబాబేనని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. పెంటపాడులోని ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకుల అరెస్టులను ఖండించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు దారుణమని అన్నారు. అరెస్టులతో వైఎస్సార్ సీపీ నాయకులను కట్టడి చేయగలరా అని కూటమి నాయకులను ప్రశ్నించారు. రాష్ట్రంలో మద్య నిషేధానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నించగా.. ప్రస్తుత కూటమి పాలనలో విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటుతో ప్రజల ఆర్యోగంతో ఆడుకుంటున్నారన్నారు. విచ్చలవిడి మద్యంతో ప్రజలు ఒళ్లు గుల్లచేసుకుని ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. అయినా ఎక్సైజ్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. అప్పులు చేసి తాగడం వల్ల కుటుంబాల్లో కలహాలు రేగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతుందని, రౌడీమూకలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు భారీ ప్రజాదరణ లభిస్తుండటం చూసి ఓర్వలేక ఆయనకు భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని కొట్టు విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై జగన్ నిత్యం పోరాటం చేస్తూనే ఉంటారన్నారు. జగన్‌తో అనుబంధం ఉన్నవారందరినీ భయపెట్టి, కేసులు పెట్టి జైలులో పెట్టడం చంద్రబాబుకు, లోకేష్‌కు పరిపాటిగా మారిందన్నారు. అలాగే సంక్షేమం కోసం ప్రతిపక్షం ప్రశ్నిస్తుందని బాబుకు, పవన్‌కు భయం పట్టుకుందన్నారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహంతో ఉన్నారని, కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని కొట్టు అన్నారు.

కొనసాగిన ఇళ్ల తొలగింపు



ఆకివీడులో ఇళ్లు తొలగిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని మంచినీటి చెరువు చుట్టూ ఉన్న ఇళ్ల తొలగింపు ప్రక్రియ రెండో రోజు ఆదివారం కూడా కొనసాగింది. బాధితులు తమ ఇళ్లను ఖాళీ చేయడంతో పొక్లెయిన్లతో కూల్చివేశారు. బాధితులు ఎవరూ అడ్డుపడకపోవడంతో కూల్చివేత కార్యక్రమం సాఫీగా సాగిపోయింది. ఆదివారం రాత్రి వరకూ తొలగింపు పనులు సాగాయి. స్థానిక ఆనాల చెరువు, దొరగారిచెరువు గట్లపై ఆక్రమణలతో పాటు జాతీయరహదారి ప్రధాన సెంటర్‌లో ఆక్రమణలు, విస్తరణ కార్యక్రమాలు చేపడతామని అధికారులు చెబుతున్నారు. ఇటీవల నగర పంచాయతీ పరిధిలోని మంచినీటి చెరువుల్ని పరిశీలించిన కలెక్టర్ నాగరాణి చెరువు గట్లపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు.

సుముహూర్తాల శ్రావణం

పెళ్లి కళ వచ్చేసిందే బాలా

- ఈనెల 25 నుంచి శ్రావణమాసం
- 26 నుంచి సుముహూర్తాలు
- ద్వారకాతిరుమల క్షేత్రంలో ఆల్ ఫుల్



ద్వారకాతిరుమల: శ్రావణమాసం వచ్చేస్తోంది. పెళ్లికళ తెచ్చేస్తోంది. ఈనెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండగా, 26 నుంచి వివాహాది శుభకార్యాలు మొదలుకానున్నాయి. ఈ ఏడాది గురు మూఢమి, ఆషాఢ మాసం కావడంతో జూన్ 10 నుంచి 48 రోజుల పాటు శుభకార్యాలకు బ్రేక్ పడింది. దాంతో పెళ్లిబాజాలు మోగక కల్యాణ మండపాలు కళ తప్పాయి. శుభకార్యాలపై ఆధారపడ్డ వ్యాపార దుకాణాలు వెలవెలబోయాయి. అయితే ఈనెల 26 నుంచి సుముహూర్తాలు ప్రారంభం కానుండటంతో వ్యాపారులు మళ్లీ బిజీ కానున్నారు. ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న వారు తమ పిల్లల వివాహాలను ఈ ముహూర్తాల్లోనే అట్టహాసంగా జరిపించాలని భావిస్తున్నారు.

శ్రీవారి క్షేత్రంలో ఆల్ ఫుల్

గురు మూఢమి, ఆషాఢ మాసం కావడంతో వివాహాలు, శంకుస్థాపనలు, గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాల ప్రారంభం, రిజిస్ట్రేషన్లు, నామకరణలు ఇతర శుభకార్యాలన్నింటికీ బ్రేక్ పడింది. శ్రావణమాసంలో ఆయా శుభకార్యాలకు పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో భారీగా వివాహాలు జరుగనున్నాయి. ప్రధానంగా ఆగస్టు 9, 13, 14 తేదీల్లో ఎక్కువ వివాహాలు జరుగనున్నాయని పండితులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే క్షేత్రంలో కల్యాణ మండపాలు, సత్రాల్లోని గదులు, కాటేజీలు అన్నీ బుక్ అయిపోయాయి.

ముహూర్తాలు ఇలా..

శ్రావణమాసం మొదలైన మరుసటి రోజు నుంచి సుముహూర్తాలు మొదలు కానున్నాయి. జూలై 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17, సెప్టెంబర్ 23, 24, 26, 27, 28, అక్టోబర్ 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31, నవంబర్ 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27 తేదీల్లో సుమూహూర్తాలు ఉన్నాయి.

వ్యాపారులకు ఊరట

48 రోజుల పాటు వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ప్రధానంగా పెళ్లిళ్లపై ఆధారపడి వ్యాపారాలు సాగిస్తున్న వస్త్ర, నగల దుకాణాలు, కల్యాణ మండపాలు వెలవెలబోయాయి. పెళ్లి తంతు సాగించే పురోహితులు ఖాళీగా ఉన్నారు. అలాగే కేటరింగ్, భోజనాల తయారీ వారు, డెకరేషన్, వీడియో, ఫొటోగ్రాఫర్లు డీలా పడ్డారు. శ్రావణ మాసం రానుండటం వీరికి ఊరట కలిగిస్తోంది.

భారీగా వివాహాలు



శ్రావణమాసంలో పెళ్లిళ్లు భారీగా జరుగనున్నాయి. నవంబర్ 27 వరకు ఉన్న సుముహూర్తాల్లో వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు అంతా సిద్ధమవుతున్నారు. ద్వారకాతిరుమల క్షేత్రంలో వేలాదిగా వివాహాలు జరుగనున్నాయి. పెళ్లివారు ముందుగా ఏర్పాట్లు చేసుకోకుంటే ఇబ్బంది పడతారు.

– గోవిందవఝుల వెంకటరమణమూర్తి శర్మ, పురోహితులు, ద్వారకాతిరుమల

48 రోజులుగా ఖాళీగా..



వివాహ ముహూర్తాలు లేక కేటరింగ్ వ్యాపారులు 48 రోజులుగా ఖాళీగా ఉన్నారు. అలాగే కల్యాణ మండపాల యజమానులు, పచ్చిపూల మండపాలు వేసేవారు, పురోహితులు అంతా ఇబ్బంది పడ్డారు. ఈనెల 26 నుంచి నవంబర్ 27 వరకు సుముహూర్తాలు ఉన్నాయి. వ్యాపారాలు బాగా జరుగుతాయని ఆశిస్తున్నాం.

–ఇమ్మడి నాగు, కేటరింగ్ వ్యాపారి, ద్వారకాతిరుమల

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం



ఆచంటలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పెనుగొండ: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు అన్నారు. మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆచంటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీతారామ్, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ ప్రతీకారంతోనే మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేసిందని మండిపడ్డారు. మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినా మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయాలనుకోవడం చంద్రబాబు కక్షపూరిత పాలనకు నిదర్శనం అన్నారు. కూటమి నాయకులు హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, దీంతో ప్రజల దృష్టి మళ్లించడానికి ఇలాంటి అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎవరూ ప్రశ్నించకూడదనే ఉద్దేశంతోనే వైఎస్సార్ సీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు. సర్పంచ్‌లు జక్కంశెట్టి చంటి, జక్కంశెట్టి శ్రీరామ్, పార్టీ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, పిల్లి రుద్రప్రసాద్, మన్నె సుబ్బారావు, పెచ్చెట్టి సత్యనారాయణ, యల్లమెల్లి రాజేష్, బొరుసు రాంబాబు, దొమ్మేటి రాంబాబు, కేతా తాతారావు, గుబ్బల రామకృష్ణ, దొంగ దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భర్త తనను వేధిస్తున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ బాబూరావు తెలిపారు. తాళ్లపూడికి చెందిన బైరవ రాజేష్‌కు, కావేరికి వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారు. వివాహమైనప్పటి నుంచి కావేరితో రాజేష్ గొడవ పడుతున్నాడు. వేరు కాపురం పెడితే మారతాడని భావించి జంగారెడ్డిగూడెంలో ఇంటిని అద్దెకు తీసుకుని గత మూడు సంవత్సరాలుగా ఉంటున్నారు. అయినప్పటికీ రాజేష్‌లో మార్పు రాలేదు. పనికి వెళ్లక పోగా, మద్యం సేవించి వచ్చి కావేరిని వేధిస్తున్నాడన్నారు. ఇటీవల కావేరి తల్లి పేరున ఉన్న ఇంటిని తన పేరుపై రాసి రిజిస్ట్రేషన్ చేయాలని వేధిస్తుండటంతో ఆదివారం కావేరి ఫిర్యాదు చేసిందన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జూనియర్ బాలికల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పూర్తి చేశామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం చేపట్టిన జిల్లా జట్టు ఎంపిక పోటీల వివరాలు వెల్లడించారు. జట్టు ఆగస్టు 14 నుంచి 17 వరకూ కోనసీమ జిల్లా పిఠాపురంలో జరిగే 10వ అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు. జట్టుకు పి.జయశ్రీ, వి.యామిని, ఏ రుత్విక, జి.పూజిత, డి.సాయిభవాణి, పి.నందిని, బి.దేవిశ్రీ, జి.సరిత, ఎస్.ఖుషీహాసిని, డి.సాయిశ్రీ లాస్య, ఏ రియా, పి.శాంతిసులోచనతో పాటు స్టాండ్‌బైగా ఎన్.రేణుక, ఊహాసత్యశ్రీ, కే రుచిత, జి.యేసు ప్రశాంతి ఉన్నారు.

విద్యార్థినులకు రక్షణగా శక్తి టీంలు



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో బాలికలు, యువతులు, మహిళలకు రక్షణగా నిలిచేందుకు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో శక్తి మహిళా రక్షక దళం ఏర్పాటు చేశారు. మరోవైపు శక్తి యాప్‌పైనా మహిళలు, విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐలు నగరంలోని ఆయా బాలికల హాస్టళ్లకు వెళ్లి ఆదివారం రాత్రి శక్తి యాప్, శక్తి టీంలపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల సెల్‌ఫోన్స్‌లో శక్తి యాప్‌ను పొందుపరిచి, ఏ విధంగా వినియోగించాలో అవగాహన కల్పించారు. ఆపద సమయంలో యాప్‌లోని ఎస్ఓఎస్‌పై నొక్కితే వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళ్లి సాయం అందుతుందన్నారు.


టైం టేబుల్‌పై ట్రిపుల్ ఐటీలో రగడ

నూజివీడు: ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్న నూజివీడు ట్రిపుల్‌ఐటీలో అనుభవం ఉన్న అధికారులు లేక నిరంతరం సమస్యలకు వేదికగా మారుతోంది. మెంటార్లకు సంబంధించిన టైం టేబుల్ నుంచి ప్రతి విషయంలోనూ అనుభవ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా పీయూసీకి బోధన చేసే తెలుగు మెంటార్లకు సంబంధించి పీరియడ్ల కేటాయింపు వివాదాస్పదంగా తయారైంది. తెలుగు డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ నిబంధనల ప్రకారం వర్క్ లోడ్ ఉండేలా మెంటార్లకు టైం టేబుల్‌ను రూపొందించగా, దానిని డీన్ అకడమిక్స్ తన ఇష్టారాజ్యంగా మార్చేయడం ట్రిపుల్ ఐటీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీయూసీ రెండు సంవత్సరాలకు బోధించేందుకు సరిపడా మెంటార్లు ఉండగా వారిని కాదని డీన్ అకడమిక్స్ సాధు చిరంజీవి హెచ్‌ఓడీ వేసిన టైం టేబుల్‌ను పక్కన పెట్టి తెలుగు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పీయూసీకి టైం టేబుల్ వేయడంపై మెంటార్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

గొడవకు కారణం ఇదే..

నూజివీడు ట్రిపుల్ ఐటీలోని పీయూసీ రెండు సంవత్సరాల విద్యార్థులకు తెలుగు బోధించేందుకు ఆరుగురు మెంటార్లు ఉన్నారు. వీరికి వారానికి 18 గంటల వర్క్‌లోడు ఉండేలా టైం టేబుల్ రూపొందించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు సంబంధించిన పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికి ఒంగోలు ట్రిపుల్ ఐటీ నుంచి ముగ్గురు తెలుగు ఫ్యాకల్టీని పంపగా శ్రీకాకుళం నుంచి ముగ్గురు రావాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే వచ్చారు. మిగిలిన ఇద్దరు తాము మంత్రి మనుషులమంటూ ట్రిపుల్ ఐటీ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇక్కడకు రాకుండా అక్కడే ఉండిపోయారు. దీంతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు తెలుగు బోధించేందుకు ఫ్యాకల్టీ కొరత ఏర్పడింది. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది.

గతంలో ఇంజినీరింగ్‌లో తెలుగు బోధించేందుకు ముగ్గురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. ఆ తరువాత ఇంజినీరింగ్‌లో తెలుగు తొలగించడంతో వీరిని పీయూసీకి బోధించమని పీయూసీకి పంపుతుంటే తమకు వర్క్‌లోడ్ సరిపోతుందంటూ పీయూసీ మెంటార్లు అభ్యంతరం చెబుతున్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు తెలుగు బోధించడానికి ఒక్క ఫ్యాకల్టీనే ఉండటం వల్ల ఖాళీగా ఉంటున్న ముగ్గురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాఠాలు చెప్పిస్తే ఎలాంటి సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. అలా కాకుండా ఈ ముగ్గురికి నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీయూసీకి నియమించి, ఇక్కడి మెంటార్లను శ్రీకాకుళం పీయూసీకి చెప్పేందుకు నియమించారు. దీంతో ఇలా ఎలా చేస్తారంటూ మెంటార్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మాకు ఇక్కడ సరిపోయే స్టాఫ్ ఉన్నామని, మిగులు స్టాఫ్ ఉంటే వారితో ఎక్కడ అవసరముంటే అక్కడ చెప్పించాలే గాని ఇలా చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. సమస్య చిన్నదైనా యాజమాన్యం మాత్రం సరిగా డీల్ చేయలేక సమస్యలను పెద్దది చేసుకుంటున్నారనే విమర్శలు ట్రిపుల్ ఐటీ వర్గాల్లోనే వినిపిస్తున్నాయి.



నూజివీడు ట్రిపుల్‌ఐటీ

డీన్‌తో మాట్లాడతా

తెలుగు సబ్జెక్టు బోధించే విషయమై వచ్చిన సమస్యపై డీన్‌తో మాట్లాడతా. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ నుంచి మరో ఇద్దరు తెలుగు మెంటార్లు ఇక్కడకు వస్తున్నారు. వాళ్లు వస్తే తెలుగు బోధించడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

బీ లక్ష్మణరావు, ఇన్‌ఛార్జి ఏఓ, నూజివీడు.

పెద్దింట్లమ్మకు పూజలు



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నీ ఆశీస్సులు మాకు అందించమ్మా అంటూ భక్తులు అమ్మను ఆర్తితో వేడుకున్నారు. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పెద్దింట్లమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మకు వేడి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూ ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మ ఫొటోల అమ్మకాలు, వాహన పూజలు, విరాళాల ద్వారా రూ.1,17,660 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేటు వద్ద ఆదివారం గుర్తు తెలియని రైలు ఢీకొని ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెం గ్రామానికి చెందిన కొత్తపల్లి అశోక్ (30) మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్సై సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని టీచర్ మృతి

- అనుమానాస్పద మృతిగా పోలీసుల కేసు నమోదు
- గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త

దెందులూరు: అనుమానాస్పద స్థితిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మందాడ దేవిక (38) తన అపార్ట్‌మెంట్‌లో ఆత్మహత్యకు పాల్పడడం కలకలం సృష్టించింది. నూజివీడు సమీపంలో బత్తులవారిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మందాడ లక్ష్మయ్య, ప్రభావతి కుమార్తె దేవికను పెదపాడు మండలం నాయుడుగూడెం గ్రామానికి చెందిన చిన్ని సురేంద్రకిచ్చి 20 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వారికి పవన్ తేజ, గౌతమ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవిక ఉంగుటూరు మండలం నల్లమాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. సురేంద్ర ఉంగుటూరు మండలం రాచూరు పాఠశాలలో హెచ్ఎంగా ఉన్నారు. చొదిమెళ్ల శ్రీవల్లి అపార్ట్‌మెంట్స్‌లో ఐదేళ్ల కిందట అపార్ట్‌మెంట్ కొన్నారు. ఉద్యోగాల నిమిత్తం ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో ఉంటున్నారు. శని, ఆదివారాలు ఏలూరు అపార్ట్‌మెంట్‌కు వెళ్తుంటారు. శనివారం సాయంత్రం 5 గంటలకు సురేంద్ర వచ్చేసరికి ఉరి వేసుకుని భార్య దేవిక మృతి చెంది ఉంది. మనస్తాపంతో కాళ్లు, చేతులపై అతను తీవ్రంగా కోసుకున్నాడు. దేవిక పుట్టిన రోజు సందర్భంగా కుమారులు శుభాకాంక్షలు చెప్పేందుకు తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. వారు లిఫ్ట్ చేయకపోవడంతో ఏలూరులోనే ఉంటున్న పెదనాన్నకు చెప్పడంతో అతను అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా రక్తమడుగులో ఉన్న తమ్ముడు కనిపించాడు. వెంటనే పోలీసులకు, సురేంద్ర మామ లక్ష్మయ్యకు విషయం తెలియచేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అపార్ట్‌మెంట్‌ను పరిశీలించారు.

మృతిపై అనుమానాలు: మృతురాలి తండ్రి

తన కూతురు దేవిక మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతురాలు తండ్రి లక్ష్మయ్య తెలిపారు. పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని కోరారు. టీచర్ మృతి చెందిన అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు పనిచేయటం లేదని సిబ్బంది తెలిపారు. ఈ నేపథ్యంలో ఇద్దరి సెల్‌ఫోన్ డేటా కీలకం కానుంది. పుట్టినరోజు నాడే తన కుమార్తె దేవిక మృతి చెందటం తట్టుకోలేకపోతున్నానని తండ్రి లక్ష్మయ్య కన్నీటి పర్యంతమయ్యారు. చిన్న కూతురుగా గారాబంగా పెంచమని ఇలా జరుగుతుందని ఊహించలేదని అన్నారు.



మృతురాలు మందాడ దేవిక (ఫైల్)



చికిత్స పొందుతున్న భర్త సురేంద్ర

ప్రమాదకరంగా ఉప్పుటేరు వంతెన

నరసాపురం రూరల్: నిత్యం సముద్రవేటకు వెళ్లే మత్స్యకారులు, ఉప్పుకార్మికులు, ఆక్వా రైతులకు ఎంతో ఆవశ్యకమైన చినలంక ఉప్పుటేరుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. తరచూ ఈ ప్రాంతంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పరిస్థితి అధ్వానంగా ఉంటున్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బియ్యపుతిప్ప నుంచి పెదమైనవాని లంక మీదుగా పేరుపాలెం వైపు వెళ్లే ఉప్పుటేరుకు చినమైనవానిలంక గ్రామంలో తూరలపై ఏర్పాటుచేసిన వంతెనపై ఉన్న రోడ్డు మార్గం ద్వారానే ఈ గ్రామ వాసులంతా సముద్రం వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. నిత్యం ఈ వంతెనపై సుమారు వందలాది మంది మత్స్యకారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి తూరలు శిథిలమై రంధ్రాలు పడడంతో పలుచోట్ల రోడ్డు దిగబడిపోయి ప్రమాదకరంగా తయారైంది. ఉప్పుటేరు ఆటుపోట్లకు నిత్యం వంతెన కోతకు గురవుతూనే ఉంటుంది.

గతంలో తాత్కాలిక మరమ్మతులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వంతెన బాగా శిథిలం కావడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేసి ప్రయాణానికి అనువుగా చేశారు. అనంతరం వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా పంపారు. అయితే ఇటీవల ఉప్పుటేరు భారీగా కోతకు గురికావడంతో వంతెన పరిస్థితి దయనీయంగా మారింది. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు. వేకువజామునే నాలుగు గంటల ప్రాంతంలో ఐల వేసేందుకు చీకట్లోనే మత్స్యకారులు దీపాలు చేతపట్టి సముద్ర చెంతకు వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో ఈ రోడ్డుపై ఉంటున్న భారీగుంతలుతోనూ ప్రమాదకరంగా ఉన్న శిథిల వంతెనతో పలు ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. వెంటనే ఈ ప్రాంతంలో పటిష్ట వంతెనను ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.



చినలంక సముద్రానికి వెళ్లే మార్గంలో కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న వంతెన

భయం భయంగా వంతెనపై ప్రయాణం



నాకు వంతెన అవతల పర్రలో చెరువులు ఉన్నాయి. వాటి సాగు నిమిత్తం నిత్యం నేను ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తుంటాను. ఒక్కోసారి వంతెన కోతకు గురై ప్రమాదకర స్థితిలో ప్రయాణం సాగించాల్సి వస్తుంది. ఈ వంతెన పూర్తిగా తెగిపోతే పెదమైనవానిలంక గ్రామం నుంచి తిరిగి రావడం తప్ప మరో మార్గం లేదు.

– మైల వెంకన్న, చినమైనవానిలంక

వంతెన నిర్మాణం అత్యవసరం



ఈ వంతెనపై మా గ్రామస్తులమే కాకుండా నిత్యం చినమైనవానిలంక బీచ్‌ను సందర్శించే వారు కూడా నిత్యం ప్రయాణిస్తుంటారు. తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తుల సమయాల్లో జిల్లా స్థాయి అధికారులు సైతం ఈ వంతెనపై నుంచే ప్రయాణించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలి.

– కొప్పాడ నాగేశ్వరరావు, చినమైనవానిలంక

రాట్నాలమ్మకు రూ.1,08,821 ఆదాయం

పెదవేగి: మండలంలోని రాట్నాలకుంట గ్రామంలో వేంచేసియున్న రాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు దేవస్థానానికి విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం పూజా రుసుంపై రూ.68,670, విరాళంపై రూ.10,831, లడ్డూ ప్రసాదంపై రూ.23,610, పులిహోర అమ్మకంపై రూ.690, ఫొటోల అమ్మకంపై రూ.5020 కలిపి మొత్తం రూ.1,08,821 ఆదాయం లభించిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో అపోహలు అవసరం లేదని, వీటితో వినియోగదారులపై అదనపు భారం ఉండే అవకాశమే లేదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదు, చార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులపై విపరీత భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి కారణంగా బిల్లులు పెరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

మావుళ్లమ్మకు సారె సమర్పణ



శ్రీమావుళ్లమ్మవారికి సారె సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మకు ఆదివారం భక్తులు వెయ్యి కిలోల ఆషాఢ సారె సమర్పించారు. క్వీన్ కిట్టి మహిళలు 51 రకాలతో 250 కిలోల సారె, విజయవాడ, ఆకివీడు, వీరవాసరం, భీమవరానికి చెందిన భక్తులు 200, 108 కేజీల చొప్పున సారె సమర్పించినట్లు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సారె అందించిన భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సీతారామపురం సౌత్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం సీతారామపురంలోని జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో మండలంలోని రుస్తుంబాద యడ్లపల్లి వారి తోట గ్రామానికి చెందిన పరసా సాయిచందు (26) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న ఆనంద్, పి.రాజ్‌కు తీవ్రగాయాలు కావడంతో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కోడి పందేలపై దాడి

ఉండి: ఉండి మండలం అర్తమూరులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడి చేశారు. దాడిలో 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోళ్ళు, రెండు కోడికత్తులు రూ.4100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కైకలూరు: కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు టౌన్ ఎస్సై ఆర్.శ్రీను హెచ్చరించారు. తామరకొల్లు గ్రామంలో కోడిపందేలపై ఆదివారం దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1250 నగదు, రెండు పుంజులను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో కోడిపందాలు, పేకాట నిర్వహిస్తు పోలను సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

వరిలో ఎరువుల వాడకం తగ్గాలి



పెనుమంట్ర: రైతులు సాగు వ్యయంలో దాదాపు 25 శాతం రసాయన ఎరువుల కోసమే ఖర్చుపెడుతున్నారని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డా.టి.శ్రీనివాస్ అన్నారు. వరిలో ఎరువుల మోతాదు తగ్గించుకునేందుకు రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. రసాయనిక ఎరువులు దేశంలో సగటున ఎకరాకు 56 కిలోలు వాడుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 102 కిలోలు వినియోగిస్తున్నారని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాలో సగటున ఎకరాకు 164 కిలోలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 170 కిలోలు వినియోగిస్తున్నారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పెనుమంట్ర, పెనుగొండ, అత్తిలి మండలాల్లో ఎరువుల వినియోగం అత్యధికంగా ఉందని తెలిపారు.



వరిలో ఎరువులు/పోషకాల యాజమాన్యం

- భూసార పరిరక్షణకు, ఉత్పత్తి కోసం రసాయన ఎరువులతో పాటు సేంద్రీయ (లేదా) జీవన ఎరువులను వాడాలి. సేంద్రీయ, రసాయన ఎరువులను కలిపి వినియోగించడం వల్ల భూసారమే పెరగడమే కాకుండా పోషకాల లభ్యత కూడా పెరుగుతుంది.
- వరి మాగాణుల్లో అపరాలు, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పైర్లను పెంచి పూతదశకు ముందు కలియదున్నడం ద్వారా భూసారం పెరగడమే కాకుండా సుమారు 20–25% వరకు నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులను ఆదా చేయవచ్చు.
- ద్రవ జీవన ఎరువులైన అజోస్పిరిల్లుం 500 మి.లీ./ఫాస్ఫో బాక్టీరియా 500 మి.లీ./పొటాషియం సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా 500 మి.లీ./సూడోమోనాస్ 500 మి.లీను ఎకరానికి 20 కిలోల ఇసుక లేదా 100 కిలోల పశువుల ఎరువు లేదా 20 కిలోల వానపాముల ఎరువుతో దమ్ము చేసిన పొలంలో నాటిన 7–10 రోజులకు, 30 రోజులకు వేసుకోవచ్చు.
- భూసార పరీక్షా ఫలితాల ప్రకారం నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను వేసుకోవాలి.
- సార్వాలో ఎకరాకు సిఫార్సు చేసిన 36:24:24 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్‌ను స్వర్ణ, ఎంటీయు–1318 రకాలకు తప్ప అన్ని మిగిలిన అన్ని రకాలకు వేసుకోవచ్చు. స్వర్ణ మరియు ఎం.టీ.యు–1318 రకాలకు 24: 24: 24 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్‌ను మాత్రమే వేయాలి.
- నత్రజని వినియోగ సామర్థ్యం పెంచడానికి 50 కిలోల యూరియాకి 10 కిలోల వేపపిండి (లేదా) 250 కిలోల తేమ కలిగిన బంక మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి పొలంలో వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది.
- పురుగులు మరియు తెగుళ్ళు ఎక్కువగా ఉన్నప్పుడు నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలి.
- భాస్వరాన్ని దమ్ములోనే ఊడ్పుకు ముందుగా వేసుకోవాలి. ఏకారణం చేతనైనా దమ్ములో వేయలేకపోతే నాట్లు వేసిన 10 రోజుల లోపులో వేసుకోవాలి.

పొటాష్ ఎరువులను రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి. వరిలో అధిక దిగుబడులు సాధించాలంటే పంటకు కావలసిన పోషకాలను సరైన మోతాదులో సకాలంలో అందించాలి. నత్రజనిని ఎక్కువగా వాడి భాస్వరం, పొటాషియం ఎరువులను సరైన మోతాదులో వేయకపోతే చీడపీడల ఉధృతి పెరిగి, తాలు కంకులు ఎక్కువగా ఏర్పడి, దిగుబడి తగ్గిపోవడమే కాకుండా పంట నాణ్యత లోపిస్తుంది. ప్రతి రైతు తప్పనిసరిగా ప్రతి రెండేళ్లకోసారైనా భూసార పరీక్షలు చేయించుకుని ఎరువుల యాజమాన్యం చేపట్టాలి.



డా.టి.శ్రీనివాస్, ఏడీఆర్, మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మిడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల నాన్ టీచింగ్ సభ్యులచే ఆదివారం తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఏపీ ఉమ్మడి జిల్లా 2025 నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పి.జయరాం, ఉపాధ్యక్షుడు యు.ఏసేపు, జనరల్ సెక్రటరీ వి.కృపారావు, జాయింట్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్, ఉమెన్ సెక్రటరీగా సీహెచ్ జయషీల, కోశాధికారిగా కె.శ్రీనివాసరాజు, ఈసీ సభ్యులుగా ఆర్‌డీఎస్ ఎన్‌వీ ప్రసాద్, ఆర్‌బీజీ మురళీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.వెంకటేశ్వరీ ఎంపికయ్యారు.

బుక్ రీడింగ్ క్లబ్‌లను సద్వినియోగం చేసుకోండి


గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బుక్ రీడింగ్ క్లబ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు బుక్ రీడింగ్ క్లబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని రీసోర్స్ పర్సన్లు జి.బాపయ్యశర్మ, ఏవీ లక్ష్మణ రావు, వి.రామాంజనేయులు, ఎ.జనార్థనరావు, కోపల్లె శ్రీనివాస్, ఎస్.కొండలరావు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ శాఖ ఆదేశాలు మేరకు స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం బుక్ రీడింగ్ క్లబ్ నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు తప్పక గ్రంథాలయానికి వచ్చే విధంగా చూడాలని, వారిచే పుస్తక సమీక్ష, పరిచయం, చర్చాగోష్టి నిర్వహించాలని పలు సూచనలు చేశారు. కేవీవీపీ సత్యప్రసాద్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆధికృత్తిక ఉత్సవం


ఆధికృత్తిక పాలకావిడి ఉత్సవంలో పాల్గొన్న షణ్ముఖులు

అత్తిలి: స్థానిక శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఆధికృత్తిక పాలకావిడి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి మాలధారణ చేసిన 100 మంది షణ్ముఖులు ఇరుముడులు ధరించి, ఆధికృత్తిక పాలకావిళ్లతో గ్రామంలో మేళతాళాలతో ఊరేగారు. ప్రత్యేక వాహనంలో స్వామి వారిని ఉంచి కోలాట భజనలతో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో పలువురు మాలధారులు ఇరుముడులు సమర్పించగా, పలువురు షణ్ముఖులు పళని యాత్రకు పయనమయ్యారు.

పేకాట స్థావరంపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో పేకాట స్థావరంపై ఆదివారం రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.18,200 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ వివరించారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పోర్ట్రైట్ డెమో – కళా ప్రదర్శన కార్యక్రమం ఆకట్టుకునేలా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. తొలుత ఈ ప్రదర్శనను కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శించిన చిత్రాలను తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రశంసలు పొంది, రెండు గిన్నిస్ రికార్డులను సాధించిన కేరళకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రాజశేఖరన్ పరమేశ్వరన్‌ను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఘనంగా సత్కరించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

భీమవరం(ప్రకాశంచౌక్): యోగా సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సూచించారు. భీమవరం బైపాస్ రోడ్డులో ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ జిల్లాస్థాయి యోగాసన పోటీలను ఆదివారం నిర్వహించారు. 10 కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 150 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కె.వెంకటరాజు, వి.శ్రీవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారి గుంతలమయం


రాళ్లు తేలిన రహదారి


గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారి

- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు
- తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మొదటి ఫ్లెఓవర్ బ్రిడ్జి నుంచి టీటీడీ కల్యాణ మండపానికి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో పెద్ద మసీద్ వద్ద నుంచి గుణ్ణం ఫంక్షన్ హాల్, మహాలక్ష్మి నగర్ రోడ్డు నంబర్–3 వరకు పలు చోట్ల గుంతలు పడ్డాయి. గత కొంత కాలంగా ఈ రహదారి మరింత అధ్వానంగా, ప్రమాదకరంగా తయారైంది. గుంతలతో పాటు రాళ్లు పైకి లేచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మార్గం గుండా ఏరియా ఆసుపత్రికి, టీటీడీ కల్యాణ మండపానికి, నిట్ కళాశాలకు, మండలంలోని పలు రూరల్ గ్రామాలు కుంచెనపల్లి, టిడ్కో ఇళ్ల వద్దకు, ఆయా ప్రాంతాలకు ప్రధాన రహదారిగా ఉంది. నిత్యం ఈ మార్గం గుండా ఆటోలు, స్కూల్ బస్సులు, కార్లు, బైక్‌లు, పాల వ్యాన్లు, ఇతర వాహనదారులు నిత్యం ప్రయాణిస్తుంటారు. దీంతో ఈ మార్గం రద్దీగా మారింది.

గుంతలతో తరచూ ప్రమాదాలు

గుంతల కారణంగా వాహనదారులు పలు ఇక్కట్లు పడుతున్నారు. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు బైక్‌లు స్కిడ్ అవుతున్నాయని, బైక్ నుంచి పడిపోయి, గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గుంతల కారణంగా ఒళ్లు హూనం అవుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు సైతం ఈ మార్గంలో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని వాపోతున్నారు. ఇటీవల గుంతలకు ప్యాచ్ వర్కులు చేశారు. అయితే తిరిగి గుంతలు, ఎత్తు, పల్లాలు ఏర్పడ్డాయి. మునిసిపల్ అధికారులు స్పందించి ఈ మార్గానికి అత్యవసరంగా మరో సారి మరమ్మతులు చేయించాలని, లేని పక్షంలో పర్మినెంట్‌గా రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.

రహదారి మార్గంలో గుంతలు పూడ్చండి



మసీద్ సెంటర్ నుంచి గుణ్ణం ఫంక్షన్ హాల్ వరకు రోడ్డు మార్గంలో గుంతలు ఏర్పడ్డాయి. బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలికంగా రోడ్డు మార్గంలో పడిన గుంతలను పూడ్చాలి. ఈ రహదారిని శాశ్వత ప్రాతిపదికన తిరిగి నిర్మించాలి.
– డీవీ ప్రసాద్, తాడేపల్లిగూడెం

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్ అధ్యక్షుడు మణీంద్ర, జనతా ట్రస్టు ఆధ్వర్యంలో పీఎంజేఎఫ్ లయన్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సాయంతో నిడదవోలు రాజరాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పీఎంజేఎఫ్ మదన్ మోహన్ అగర్వాల్ శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత నేత్ర శిబిరంలో 117 మంది పరీక్ష చేయించుకున్నారు. 22 మందికి కళ్లజోళ్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ల నిమిత్తం 17 మందిని, ప్రత్యేక ట్రీట్మెంట్ నిమిత్తం 19 మందిని నిడదవోలు ఆసుపత్రికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. రీజియన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్‌రావు, జనతా వైద్యులు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్‌వీసీ త్రిమూర్తులు, కోశాధికారి కిరన్ కుమార్, వెంకటేశ్వరరావు, బాబాయ్ శర్మ, పదాల మహేశ్వరరావు, సోమేశ్వరరావు, యర్రా ఆంజనేయ స్వామి, సునీల్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ అమలులో కూటమి విఫలం

- మోసకారి చంద్రబాబు
- రానున్నది జగనన్న ప్రభుత్వమే..
- వైఎస్సార్ సీపీ కోసం శాయశక్తులా కృషి
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీలో మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


పాల్గొన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కొట్టు

పెంటపాడు: చంద్రబాబు పచ్చి మోసగాడని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. అదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పెంటపాడు ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన అందిస్తే చంద్రబాబు ప్రజలను మోసం చేసి పాలన కొనసాగిస్తున్నారని కొట్టు ఘాటుగా విమర్శించారు. మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసి పాలన సాగిస్తున్నారని ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకత మొదలైందన్నారు. రానున్న రోజులలో కూటమికి ప్రజలే సరైన బుద్ధిచెబుతారన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరిస్తానని చెప్పి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూటమి నాయకులకు తలొగ్గారన్నారు. ఇదేనా మీరు ప్రజలకు చేస్తానన్న హామీలు అని బాబు, పవన్‌లను ప్రశ్నించారు. ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేయకుండా 13 నెలలు తాత్సారం చేశారన్నారు. చంద్రబాబు ఏం చెబితే దానికి తలూపడం పవన్‌కు సరికాదన్నారు.

ఉచిత గ్యాస్ , ఉచిత బస్సు, తల్లికి వందనం, పలు పథకాలను ప్రవేశపెట్టి లబ్ధిదారులకు చేరకుండా కూటమి ప్రభుతం అబాసు పాలవుతుందన్నారు. సూపర్‌సిక్స్ అమలు అయ్యేవరకు తాము నిద్రపోనివ్వమన్నారు. ఈ విషయంపై తమ పార్టీ అధినేతతో పాటు, పార్టీ కేడర్ నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. తాము ప్రజల పక్షమన్నారు.

ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలి

ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయలని డిమాండ్ చేశారు. ప్రతి కార్యకర్తా వైఎస్సార్ సీపీ చేస్తున్న బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గడప, గడపకూ తీసుకెళ్లాలని హితవు పలికారు. కూటమి మోసాలు ప్రజలకు వివరించాలన్నారు. అదే విధంగా వెస్సార్ సీసీ బలోపేతానికి కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, కైగాల శ్రీనివాస్, కర్రి బాస్కరరావు, కొవ్వూరి భాస్కరరెడ్డి, సలుమూరి ప్రకాష్, దాసరి హైమావతి, కొలనువాడ అన్నవరం (దత్తుడు) గుండుమొగుల సాంబయ్య, పాలా గణపతి, బర్ల జయరాంబాబు, కొలుకులూరి ధర్మరాజు, దెందుకూరి సూర్యానారాయణ రాజు, రెడ్డి సూరిబాబు, నల్లమిల్లి అప్పిరెడ్డి, బోద్దాని శ్రీనివాస్, కిరణ్‌రెడ్డి, కొవ్వూరి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పెంటపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటామని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం పెంటపాడు ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు తమ సమస్యలను వివరించారు. అనంతరం పార్టీలో నూతనంగా పదవులు పొందిన వారిని కొట్టు సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. పార్టీ అభ్యున్నతికి నిత్యం పాటు పడాలని హితవు పలికారు.

‘బాబు’ మోసాలపై కరపత్రాల పంపిణీ


కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇరగవరం: మండలంలోని కె.కుముదవల్లి గ్రామంలో ఆదివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు కారుమూరి వెంకట నాగేశ్వర రావు ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారేంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి, బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందనే విషయం వివరించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, 50 ఏళ్లకే పింఛన్ వంటి హామీలను ఏ మాత్రం అమలు చేయలేదన్నారు. మేము పెద్ద ఎత్తున పోరాటం చేస్తే ఒకటి, రెండు హామీలు నేరవేర్చారని, అవి కూడా అరకొరా అమలు చేశారన్నారు. కరెంటు బిల్లులను సాకుగా చూపి పథకాలకు మంగళం పాడుతున్నారని తెలిపారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హమీ అమలు చేయాలన్నారు. అవి నేరవేర్చే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలోమాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గ ప్రసాద్, ఉపాధ్యాక్షులు జాలి సుబ్బరావు కటరి రామరాజు, చోడే ఏసురత్నం, సైపురెడ్డి పెద్దిరాజు, మామిడిశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ


అత్తిలి : అమ్మవారికి సారెను తీసుకొస్తున్న భక్తులు


తాడేపల్లిగూడెం రూరల్: కొండ్రుప్రోలు అంకాలమ్మకు సారె సమర్పించిన భక్తులు

అత్తిలి: ఆషాఢమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా అత్తిలి గోగులమ్మపేటలో శ్రీగోగులమ్మకు ఆషాఢమాస సారెను భక్తులు సమర్పించారు. పలు రకాల స్వీట్లు, పళ్లు, పుష్పాలను మేళ తాళాల నడుమ గ్రామంలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి ఆషాఢమాస సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అత్తిలి శివారు బల్లిపాడు రోడ్డులోని శ్రీకొండాలమ్మకు భక్తులు సారె ను అందజేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కొండ్రుప్రోలు అంకాలమ్మకు..

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅంకాలమ్మకు ఆదివారం భక్తులు ఆషాఢమాసం సందర్భంగా సారె సమర్పించారు. తొలుత పసుపు, కుంకుమ, చీర, జాకెట్, ఇతర మంగళ వాయిద్యాలతో మహిళలు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి పుట్టినిల్లుగా భావిస్తున్న పులమోలు వెంకటేశ్వరరావు, అత్తింటి వారు బొట్టా శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ నాయకులు జానా బాబి, రాజుల పాటి సత్తిరాజు, రాజులపాటి వెంకటేశ్వరరావు, బండి సూర్యగణపతిరావు, రుద్ర రామచంద్రరావు, పసల వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి భాస్కర రావు, కంకట చినబాబు, కొమ్మ శ్రీను, గంగవరపు శ్రీను పాల్గొన్నారు. కాగా, మోదుగ గుంట గ్రామంలోని మార్లమ్మకు భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తులు కేశబోయిన ధర్మారావు, కామన గణపతి, అంకం రామారావు, చిమ్లి ఏసు పాల్గొన్నారు.

బ్యాంకుల జాతీయీకరణ ఫలాలు అందాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్యాంకుల జాతీయీకరణ ఫలాలు రైతులు, సామాన్యులకు అందాలని బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ మైలాబత్తుల సుభకర్ అన్నారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో సుభకర్ మాట్లాడుతూ బ్యాంకుల జాతీయీకరణ కోసం బ్యాంక్ యూనియన్లు చేసిన పోరాటాలు మరువలేమన్నారు. 1960కి పూర్వం బ్యాంకులు పారిశ్రామిక అధిపతులకు మాత్రమే ఉపయోగపడేవని, బ్యాంకులు ప్రభుత్వపరమైన తరువాత నేడు సమాజానికి సహకరిస్తున్నాయని చెప్పారు. నేడు బ్యాంక్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘటిత పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవాలని చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ ఎం.రమేష్ నాయుడు, బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారుల సమాఖ్య జోనల్ కార్యదర్శి జవహర్‌లాల్, బీఓఐ నాయకులు టీవీ సూర్యనారాయణ, కిరణ్, ఎస్.ఎస్.ప్రసాద్, పీపీఎస్ఆర్ బాబు, ఏడుకొండలు, గాంధీ, ఇందిరా ప్రియదర్శిని, సిద్ధాబత్తుల సూర్యనారాయణ, బ్యాంకు ఉద్యోగుల కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, యూఎఫ్‌బీయూ సభ్యులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సుభకర్

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలకు షాక్ కొట్టే అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మూడో రోజు ఆదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంచి, ర్యాలీ నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదానీ స్మార్ట్ మీటర్లను బిగించాలని చూస్తుందని దీనిని వ్యతిరేకించాలన్నారు.


ర్యాలీలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న ప్రజలు, నేతలు

బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉండాలి

అత్తిలి: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఏపీ బీఎస్ఎస్ఎస్ బైలాస్ సవరణ సమావేశం ఆదివారం తణుకులో ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కోనూరి సతీష్ శర్మ మాట్లాడుతూ ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య వ్యవస్థాపకులు, గత కుర్తాళం పీఠాధిపతి ఆంజనేయులు స్వస్థలమైన తణుకులో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణులు ఐకమత్యంతో ఉండాలని సంఘ గౌరవ సలహాదారు సత్యవాద దుర్గాప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో బైలాస్ కమిటీ చైర్మన్ పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ హెచ్‌కే మనోహర్, కోశాధికారి పులిపాక ప్రసాద్, బలిజేపల్లి రవిశంకర్, మంత్రిరావు వెంకటరత్నం, పొన్నా సుధీర్ శర్మ, ఎ.పార్థసారథి, కలగ సుబ్రహ్మణ్యం, కలగ సుందరం, నాగరాజు శ్రీరామ్ వైభవ్, తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు సూరంపూడి కామేష్‌ను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

భీమవరం (ప్రకాశంచౌక్): నేర ప్రవృత్తికి స్వస్తి చెప్పి, సత్ప్రవర్తనతో జీవించాలని, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నేడు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులను, రౌడీ షీటర్లను సంబంధిత పోలీసు అధికారులు స్టేషనుకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నిరంతరం మీ కదలికలపై నిఘా ఉంచడం జరుగుతుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు నమోదు చేసి జైలుకు పంపిస్తామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

నరసాపురంలో డ్రైయిన్లు అధ్వానం

- వర్షాలతో పొంగి పొర్లుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు

నరసాపురం: ప్రతి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా కూడా నరసాపురం పట్టణం డ్రెయినేజీ వ్యవస్థ నానాటికీ క్షీణిస్తోంది. పట్టణంలో ఏ డ్రెయిన్‌ను చూసినా దుర్వాసన వెదజల్లుతుంది. ప్రస్తుతం కురుస్తున్న కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళనకు భారీ ప్రాజెక్ట్‌ను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసినా కూడా ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్ట్ ఊసే లేకుండా పోయింది. దీంతో కొంత కాలంగా కొత్తగా డ్రెయిన్లను నిర్మించకపోవడం, కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో డ్రెయిన్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి.

అన్ని డ్రెయిన్లు అంతే

ప్రస్తుతం పట్టణంలో చాలా ప్రాంతాల్లో డ్రెయిన్ల ఇబ్బందులున్నాయి. పట్టణంలో బస్టాండ్ సెంటర్, మాధవాయిపాలెం, రాయపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో ప్రధాన డ్రెయినేజీలున్నాయి. వార్డులోని పలు వీధుల్లో ఉన్న ఉప డ్రెయిన్లన్నీ ఈ ప్రధాన డ్రెయినేజీల్లో కలుస్తాయి. ప్రధాన డ్రెయిన్లన్నీ గోదావరిలో ఐదు చోట్ల కలుస్తాయి. మురుగు గోదావరిలో కలిసే చోట ఔట్‌ఫాల్ స్లూయిజ్‌లు కూడా సరిగ్గా లేవు. గోదావరిలో మురుగు కలిసే చోట అవుట్‌లెట్‌లు సరిగా లేకపోవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా ఉంటుంది. ఇక డ్రెయినేజీలు అధ్వానంగా ఉండడంతో వర్షం వస్తే బస్టాండ్ ఏరియా, పొన్నపల్లి, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్ ప్రాంతాలు వర్షం నీరు పారక నీటమునుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వర్షపునీరు సవ్యంగా పారేటట్లు డ్రెయినేజీలను ఆధునీకీకరించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే 21, 22,23, 24, 25, 26, 27 వార్డులు, పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్ పేట ప్రాంతాల్లో మైనర్ డ్రెయిన్లను వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంది.


పట్టణంలోని బస్టాండ్ పక్కన ప్రధాన ప్రాంతంలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

స్పెషల్ ప్రాజెక్ట్ ఊసేది?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నరసాపురం మున్సిపాలిటీలో రూ.220 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్థికశాఖ అనుమతులతో పనులు మొదలు పెట్టడానికి మొదటి విడతగా రూ 50 కోట్లు మంజూరు కూడా చేసింది. ప్రాజెక్టులో భాగంగా ముందుగా 1 నుంచి 9 వార్డుల్లో పనులు మొదటు పెట్టడానికి టెండర్లు కూడా పిలిచారు. తరువాత ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్ట్ అటకెక్కింది. ఈ ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ అంశంపై నోరుమెదిపిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి పట్టణంలో డ్రెయిన్ల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.